క్లుప్తంగా

కొళాయి పైపులైన్లకు మరమ్మతులు



కొళాయిలకు మరమ్మతులు చేయిస్తున్న గ్రామ కార్యదర్శి

సాక్షి ఎఫెక్ట్..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని వీయస్ పురం గ్రామపంచాయతీ పరిధిలోని వేణుగోపాల పురం గ్రామంలో తాగునీటి పైపులైన్ కొళాయిలకు శనివారం గ్రామ కార్యదర్శి రజనీకాంత్ మరమ్మతులు చేపట్టారు. గురువారం సాక్షి దినపత్రికలో తాగునీటి వృథా అరికట్టండి అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన గ్రామ కార్యదర్శి రజనీకాంత్ తాగునీటి కొళాయిల ట్యాప్‌లు, గేట్ వాల్వ్‌లు బిగించి మరమ్మతులు చేపట్టారు. దీంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

డ్రమ్ సీడర్‌తో వరి నాట్లు



డ్రమ్ సీడర్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని రైతులు ఖరీఫ్ సీజన్‌లో వరి నాట్లను డ్రమ్ సీడర్‌తో నాటాలని మండల వ్యవసాయాధికారి భారతి తెలిపారు. ఆమె శనివారం డ్రమ్ సీడర్ వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ డ్రమ్ సీడర్‌తో వరి నాట్లు నాటడం వలన రైతులకు ఖర్చు తగ్గుతుందన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి వస్తుందన్నారు. నాట్లకు కూలీల కొరత ఉండదని, నీరు ఆదా అవుతుందని తెలిపారు. డ్రమ్ సీడర్‌ను రైతులకు సబ్సిడీపై అందజేస్తున్నామని, వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈఓలు రేవతి, భారత్, రైతులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాలు మంజూరు చేయాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న గిరిజనులు

సత్యవేడు: మండలంలోని పేరడం గ్రామంలో 35 కుటుంబాల గిరిజనులు నివశిస్తున్న స్థలాలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని సీఐటీయూ నాయకుడు రమేష్ డిమాండ్ చేశారు. శనివారం పేరడం గ్రామ గిరిజనులు, సీఐటీయూ నాయకులు కలసి తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఉన్న తహసీల్దారు 35 మందికి ఇంటి పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ప్రస్తుతం నూతనంగా వచ్చిన తహసీల్దార్ గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుశీల, కన్నెమ్మ, లక్ష్మమ్మ, ఎం.మారెమ్మ, టి.అమ్ములు, చెంచమ్మ, సిద్ధమ్మ, ఎం.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పోరంబోకు పట్టా రద్దు

సత్యవేడు: పంచాయతీ పరిధిలోని ఎస్సీకాలనీకి చెందిన లేట్ చెల్లయ్యకు 2024లో రెవెన్యూ అధికారులు రోడ్డు పోరంబోకులో పట్టా ఇచ్చారు. దానిని పరిశీలించిన ప్రస్తుత తహసీల్దార్ టీవీ సుబ్రమణ్యం శనివారం రద్దు చేశారు. తనకు న్యాయం చేయాలని చల్లయ్య భార్య శాంతి కోరారు. జగనన్న కాలనీలో ఖాళీ స్థలంలో ఆమెకు ఇంటి నివేశన స్థలం స్వాధీన పత్రంను అందజేసి, ఇల్లు కట్టుకొనేందుకు స్థలం చూపించారు. బాధితులకు శాశ్వత పరిష్కారం చేసినట్లు తహసీల్దార్ ఓ ప్రకటనలో తెలిపారు.

ముక్కంటి సేవలో మాజీ ఎన్నికల అధికారి



ఆలయ ధ్వజస్తంభం వద్ద పార్థసారథి

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శనివారం తెలంగాణ మాజీ ఎన్నికల అధికారి పార్థసారథి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



రాత్రిపూట గస్తీ తప్పనిసరి

విధి నిర్వహణలో ఉన్న వైద్య సిబ్బందిపై రోగులు, వారి తాలూకా బంధువులు దాడులకు తెగబడుతున్నారు. రాత్రి పూట కనీసం రెండు సార్లు అయినా పోలీస్ గస్తీ నిర్వహించాలి. రాత్రులు పోలీసులు పహారా ఉన్నట్లు తెలిస్తే రౌడీమూకల ఆగడాలు తగ్గుతాయి. మహిళా వైద్యులు నిర్భయంగా సేవలందించవచ్చు. దీనిపై ప్రభుత్వాలు, అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవలసిన అవసరం ఉంది.

-టి.సురేఖ, ఫిజియోథెరపిస్టు, కమ్యూనిటీ వైద్యశాల, సత్యవేడు



పనిచేసే చోటే రక్షణ లేకుంటే..

మహిళలకు పనిచేసే చోటే రక్షణ లేకుంటే.. బయట రక్షణ ఎలా లభిస్తుంది? మగవారితో సమానంగా మహిళలకు అన్ని హక్కులు ఉంటున్నపుడు పది మందితో కలిసి పనిచేస్తున్న పురుషులకు రాని ఇబ్బందులు, మహిళలకే ఎందుకు ఎదురవుతున్నాయో ప్రభుత్వాలు ఆలోచించాలి. మహిళల రక్షణ కోసం చట్టాలను మరింత కఠినతరం చేయాలి. మహిళా వైద్యులపై దాడులను ఎట్టి పరిసితుల్లో ఉపేక్షించకూడదు.

– డాక్టర్ రాగసుధ, పీహెచ్‌సీ డాక్టర్, నారాయణవనం



దుస్థితిలో గంగ కాలువ

- 17 సంవత్సరాలుగా మరమ్మతులకు నోచుకోని కాలువలు
- పట్టించుకోని తెలుగు గంగ అధికారులు
- పంటలకు అందని గంగ నీరు



నీర్పాకోట గ్రామంలో ధ్వంసమైన కాలువ

బుచ్చినాయుడుకండ్రిగ: తెలుగుగంగ నీటిని పంట పొలాలకు అందించే బ్రాంచి కాలువలు దుస్థితికి చేరుకున్నాయి. దీంతో పంటలకు నీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో తెలుగుగంగ మెయిన్ కాలువ నుండి 8 ఎ1ఆర్, 8బీ, 7ఎకెనాల్‌ల నుండి 4 ఎల్ మేజరు బ్రాంచి కాలువలకు నీరు వస్తుంది. 4 ఎల్ మేజరు కాలువ బుచ్చినాయుడుకండ్రిగ, వరదయ్యపాళెం, సూళ్లూరుపేట మండలాల్లో ఉంది. కాలువ 50 కిలో మీటర్లు పొడవు ఉంది. కాలువను 2005వ సంవత్సరంలో తవ్వారు. అప్పటి నుండి కాలువకు ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదు. మండలంలోని 10 వేల ఎకరాల మెట్టభూములకు, చెరువుల ఆయకట్టు ఉన్న 12 వేల ఎకరాలకు ఈ కాలువ నుండి నీరు అందుతోంది. అదే విధంగా వరదయ్యపాళెం మండలంలో 4 వేల ఎకరాల మెట్ట భూములకు, 3500 ఎకరాలకు చెరువు ఆయకట్టు భూములకు, సూళ్లూరుపేట మండలంలో 5 వేల ఎకరాల మెట్ట భూములకు, 2800 ఎకరాలకు చెరువు ఆయకట్టు భూములకు నీటిని అందిస్తుంది. 15 సంవత్సరాలుగా కాలువకు మరమ్మతులు చేపట్టకపోవడంతో కాలువ అధ్వానంగా ఉంది. కాలువకు గండ్లుపడి ఉండడంతో గంగనీరు పొలాలకు, చెరువులకు చేరటంలేదు. కొన్నిచోట్ల రైతులు కాలువకు మరమ్మతులు చేసుకొంటున్నారు. కాలువ మరమ్మతులకు గురికావడంతో గంగనీరు అందక పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువకు మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు తెలుగుగంగ అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా తెలుగుగంగ అధికారులు స్పందించి తెలుగుగంగ స్లూయిజ్ కాలువలకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



గాజులపెళ్లూరు గ్రామం పొలాల్లో కాలువకు పడిన గండి



కుక్కంబాకం గ్రామంలో దుస్థితిలో ఉన్న కాలువ

కాలువకు మరమ్మతులు చేపట్టాలి

తెలుగుగంగ స్లూయిజ్ కాలువలు మరమ్మతులకు గురై ఉన్నాయి. కాలువలకు మరమ్మతులు చేపట్టాలి. కాలువలను తవ్వి 17 సంవత్సరాలు కావస్తుండడంతో నామరూపాలు లేకుండా పోయాయి.

– సుబ్రమణ్యం, రైతు, కుక్కంబాకం గ్రామం

గంగనీరు రాక పంటలు ఎండిపోతున్నాయి

తెలుగుగంగ స్లూయిజ్ కాలువలు మరమ్మతులకు గురికావడంతో గంగనీరు పంటలకు అందక ఎండి పోతున్నాయి. కాలువలకు సొంత డబ్బులతో మరమ్మతులు చేసుకుంటున్నాం. అధికారులు పట్టించుకోవడం లేదు.

– మునెయ్య, రైతు, కరకంబట్టు గ్రామం

త్వరలోనే మరమ్మతులు చేపడతాం

దుస్థితిలో ఉన్న తెలుగుగంగ స్లూయిజ్ కాలువకు మరమ్మతుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. కాలువల మరమ్మతులు చేయడానికి ప్యాకేజీని సిద్ధం చేశాం. నిధులు మంజూరు కాగానే కాలువల మరమ్మతు పనులను చేపడుతాం.

– పెంచలయ్య, డీఈ, బుచ్చినాయుడుకండ్రిగ

ఘనంగా ప్రత్యేక పూజలు



ఆలయంపై శిఖరాలు

బుచ్చినాయుడుకండ్రిగ: నీర్పాకోట గ్రామంలోని శ్రీవేంకటేశ్వరాలయంలోని శంఖు, చక్ర, తిరునామాలకు శ్రావణ శనివారం గ్రామస్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. దేవాలయం ఉన్న శిఖరాలకు ప్రత్యేక పూజలు చేశారు. శంఖు, చక్ర, తిరునామాలకు పూల అంకరణ చేసి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజ కార్యక్రమం అంగరంగ వైభవంగా సాగింది. భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



శ్రీ వేంకటేశ్వర స్వామి శంఖు, చక్ర, తిరునామాలు

కృష్ణాష్టమి వేడుకల్లో చిన్నారులు



నాగలాపురం: ఉట్టి కొడుతున్న పిల్లలు

శ్రీకాళహస్తి: పట్టణంలోని విక్రమ్ నెక్ట్స్ జన్‌అప్పర్ ప్రైమరీ పాఠశాలలో శనివారం ఘనంగా ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. చిన్నారులు వేసిన కృష్ణుడు, గోపికల వేషధారణ అలరించింది. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. కృష్ణాష్టమి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్, కరస్పాండెంట్ మునిలక్ష్మి, ప్రిన్సిపాల్ ఉమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జేబీఆర్ విద్యాసంస్థల్లో కృష్ణాష్టమి

నాగలాపురం: పిచ్చాటూరు మండల కేంద్రంలోని జేబీఆర్ పాఠశాలలో ఆ సంస్థల అధినేత జేబీఆర్ మునిరత్నం ఆధ్వర్యంలో శనివారం ముందస్తు శ్రీకృష్ణ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ విద్యాసంస్థల చైర్మన్ మాట్లాడుతూ కృష్ణాష్టమి పండుగను హిందువులు ఎంతో ఆనందంగా జరుపుకుంటారని.. పిల్లల్లో పండుగపై ఆసక్తిని కలిగించేలా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. పిల్లలతో ఉట్టి కొట్టించడం.. వివిధ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ భూలక్ష్మీ, ఏవో అంకయ్య, ఉపాధ్యాయ బృందంతోపాటు విద్యార్థులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు



సుగుణకు జ్ఞాపికతో పాటు బహుమతులు అందజేస్తున్న అర్జునబాబు

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో శనివారం మహాభారత్ క్విజ్ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఆలయంలో జరిగిన బ్రహ్మోత్సవాల అనంతరం ఎంజీఎం ట్రస్ట్ ఆధ్వర్యంలో మహాభారతంపై శుక్రవారం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు పాపానాయుడుపేట పరిసర గ్రామాల నుంచి 45 మంది హాజరయ్యారు. వీరిలో రేణిగుంట మండలం జీపాలెం గ్రామానికి చెందిన సుగుణ ప్రథమ, పాపానాయుడుపేటకు చెందిన జనార్దన్ శెట్టి ద్వితీయ, ఉదయ్‌కుమార్, వికృతమాలకు చెందిన చెంచుకృష్ణ తృతీయ బహుమతులు సాధించారు. వీరికి ఎంజీఎం ట్రస్ట్ చైర్మన్ అర్జునబాబు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రాధాకృష్ణయ్య, శంకర్‌రెడ్డి, జాఫర్, రవి, శివ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అశ్లీలతకు అడ్డుకట్ట వేస్తేనే మహిళలకు రక్ష



మాట్లాడుతున్న సుందరరాజన్

శ్రీకాళహస్తి: సామాజిక మాధ్యమాల్లో నిత్యం దర్శనమిస్తున్న అశ్లీలతకు అడ్డుకట్ట వేస్తేనే సమాజంలో మహిళలకు రక్షణ ఉంటుందని క్రిస్టియన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ ఫౌండర్ కె.సుందరరాజన్ అన్నారు. పట్టణంలో ఓ ప్రైవేటు కార్యాలయంలో శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2005 నుంచి సామాజిక మాధ్యమాల ప్రారంభం నుంచి అధికమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా, మొబైల్‌ఫోన్లలో వస్తున్న అశ్లీల దృశ్యాలు వంటి కారణంగా ప్రస్తుతం మహిళలపై లైంగిక దాడులు మరింత పెరిగాయన్నారు. కోల్‌కతా, శ్రీకాళహస్తి ఘటనలపై అధికారులు సమగ్ర విచారణ జరిపి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మహిళల భద్రతకు అవసరమైన చట్టాలను తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అన్వర్ బాషా, మీర్జాన్ సాహెబ్, ఇస్మాయిల్, కరీముల్లా, రఫాయేల్, రమేష్, భాస్కర్, దేవసహాయం, కోగిల ధర్మయ్య, కొండయ్య, యోహాన్, లాజర్ తదితరులు పాల్గొన్నారు.

ఆగమోక్తంగా శనీశ్వరస్వామికి తైలాభిషేకం



ప్రత్యేక అలంకారంలో శనీశ్వరస్వామి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి నువ్వుల నూనె, మంచి నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని పలు పుష్పాలతో విశేషంగా అలంకరించారు. విశేష పూజలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

ఘనంగా చెంగాళమ్మ గ్రామోత్సవం

వరదయ్యపాళెం: శ్రీచెంగాళమ్మ పరమేశ్వరిదేవి ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి అమ్మవారి గ్రామోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. అశేష భక్తజనుల నడుమ అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేపట్టి గ్రామ పుర వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా ఇళ్ల వద్ద అమ్మవారికి కర్పూర నీరాజనాలు సమర్పించి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అంతకు ముందు ఉదయం అమ్మవారికి సుగంధ ద్రవ్యాలతో అభిషేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో అమ్మవారి ముగ్గును అందంగా తీర్చిదిద్దారు. పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారి రూపంలో తీర్చిదిద్దిన ముగ్గును దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. గ్రామపెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం

రాపూరు: మండలంలోని పెంచలకోనలో శనివారం పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామునే సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. 6 గంటలకు పూలంగిసేవ నిర్వహించారు. 10 గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను నిత్యకల్యాణ మండపంలో కొలువుదీర్చారు. వేదపండితుల మంత్రోచ్ఛరణలతో కల్యాణం చేశారు. సాయంత్రం ఊంజల్ సేవ కనులపండువగా నిర్వహించారు.

ఉపాధి కూలీ మృతి



గురవమ్మ (ఫైల్)

ఏర్పేడు: మండలంలోని కోబాక ఎస్సీ కాలనీలో శనివారం ఉపాధి కూలీ మృతిచెందిన ఘటన స్థానికంగా విషాదాన్ని మిగిల్చింది. గ్రామస్తుల కథనం.. మండలంలోని కోబాక ఎస్సీ కాలనీకి చెందిన తొన్నాటి గురవమ్మ(45) శనివారం రెండు కిలో మీటర్ల దూరంలోని కుప్పయ్యకండ్రిగలో జరిగే ఉపాధి హామీ పనులకు వెళ్లింది. పనులు ముగించుకుని మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఇంటికి కాలినడకన వెళ్తుండగా మార్గ మధ్యంలో ఎండతీవ్రతకు అస్వస్థకు గురై పడిపోయింది. తోటి కూలీలు చికిత్స కోసం రేణిగుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని మృతురాలి కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



సత్యవేడులో ర్యాలీ

సత్యవేడు: కోల్‌కతా జూనియర్ డాక్టర్‌ని అత్యాచారం, హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఏఐవైఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు శనివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సత్యవేడు గాంధీ, రోడ్డు నేతాజీ రోడ్లపై భారీ ర్యాలీ నిర్వహించారు. గాంధీ విగ్రహం సమీపంలో మానవహారం చేపట్టారు. ఏఐవైఎఫ్ జిల్లా జాయింట్ సెక్రటరీ నాగార్జున మాట్లాడుతూ వైద్యురాలిపై అత్యాచారం, హత్య చేయడం దారుణమన్నారు. దేశంలో రోజు రోజుకు అత్యాచారాలు, హత్యలు పెరుగుతున్నా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ సత్యవేడు డివిజన్ కార్యదర్శి మురళి, జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు అండగా ప్రజాప్రగతి ట్రస్టు



కేవీబీపురం మోడల్ స్కూల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

వరదయ్యపాళెం: పేద విద్యార్థుల అభివృద్ధికి ప్రజాప్రగతి ట్రస్టు అందిస్తున్న సహకారం అభినందనీయమని స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. శనివారం కేవీబీపురం మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు ప్రజాప్రగతి ట్రస్టు ద్వారా సైన్స్ కిట్లను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో విద్యార్థులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ట్రస్టు స్ఫూర్తితో ప్రతి విద్యార్థి ఉన్నత ఫలితాల సాధన దశగా అడుగులు వేయాలని సూచించారు. పాఠశాల ప్రాంగణంలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో పుత్తూరు డీవైఈఓ ప్రభాకరరాజు, ట్రస్టు చైర్మన్ శ్రీనివాసులు, ఎస్ఎంసీ చైర్మన్ సురేష్ రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు రామాంజుల నాయుడు పాల్గొన్నారు.

ఘనంగా వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు



అన్నదానం చేస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు, పీజే చంద్రయ్య

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం రామచంద్రాపురంలో వెలసిన వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలను శనివారం శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి మాజీ సభ్యులు పీజే చంద్రయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దీనికి పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో తులసి, వల్లం గోపి, సుబ్బారావు, కుందా మోహన్ పాల్గొన్నారు.

స్విమ్స్‌లో పీడియాట్రిక్ సర్జరీలపై సెమినార్



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డైరెక్టర్ ఆర్వీ కుమార్

తిరుపతి సిటీ: స్విమ్స్ కార్డియోథెరపిక్ అండ్ వాస్క్యులర్ సర్జరీ, పద్మావతి చిల్డ్రన్స్ హార్ట్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో పద్మావతి వైద్య కళాశాలలో ఫోకస్డ్ మీట్ ఆఫ్ పీడియాట్రిక్ అండ్ కంజెనిటల్ స్పేస్ హార్ట్ సర్జన్స్ ఇండియా అనే అంశంపై శనివారం సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని స్విమ్స్ డైరెక్టర్, వీసీ డాక్టర్ ఆర్వీ కుమార్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్లిష్టమైన ఆపరేషన్లు చేసే సమయంలో తీసుకోవాల్సి జాగ్రత్తలు, విధానంపై రెండు రోజుల పాటు వైద్యులకు, వైద్య విద్యార్థులకు సెమినార్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు, వైద్య విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

చెట్ల మాటున సూచిక బోర్డులు



సూచిక బోర్డులకు అడ్డుగా ఉన్న కంపచెట్లు



రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లు

శ్రీకాళహస్తి రూరల్: రాష్ట్ర, జాతీయ రహదారుల్లో ప్రమాదాలను నివారించేందుకు మలుపుల వద్ద ఏర్పాటు చేసే సూచిక బోర్డులు కనిపించడం లేదు. అవి చెట్లు మాటున ఉండడంతో వాహనదారులు ప్రాణాలను ముందుగా సూచిక బోర్డులను వెతికి, తర్వాత మలుపులు గుర్తించాల్సిన పరిస్థితి. శ్రీకాళహస్తి మండలం రామాపురానికి వెళ్లే ప్రధాన రహదారి సింగిల్ లైన్ కావడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అందులోనూ అనేక మలుపుల వద్ద సూచిక బోర్డులు లేకపోవడం, ఉన్నచోట్ల చెట్లు అడ్డు ఉండడంతో సూచిక బోర్డులు కనపడకుండా ప్రమాదాలు సంభవించే పరిస్థితులు నెలకొన్నాయి. సింగిల్ లైన్ రోడ్డు అందులోను చెట్లు ఇరువైపులా రోడ్డుపైకి రావడంతో మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనపడడం లేదు. అందువల్ల అనేక ప్రమాదాలు సంభవించి ఎంతోమంది ఆస్పత్రి పాలైన సంఘటనను చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సూచిక బోర్డులు ఏర్పాటు చేసి రోడ్డుకు అడ్డంగా ఉన్న కంపచెట్లను తొలగించాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.